సాక్షి వరంగల్
ఆదివారం । 28 । జూలై । 2024



విద్యుత్.. కావొద్దు విషాదం
వినియోగదారులు, రైతులు విద్యుత్ ప్రమాదాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.
- 10లో ▸



నిలకడగా ప్రాణహిత నది
మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది నిలకడగా ప్రవహిస్తోంది.
- 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30⁰ /25⁰
జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

కొమ్మాల ఆలయంలో జడ్జి పూజలు



గీసుకొండ: మండలంలోని ప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం నర్సంపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శిరీష స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆమెకు అర్చకులు రామాచారి, విష్ణు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఊకల్‌హవేలిలోని నాగేంద్రసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సుముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష జడ్జిని సన్మానించారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్ స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఫణి, కాంగ్రెస్ నాయకులు వీరాటి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాకాల.. జలకళ




ఖానాపురం: వరుసగా కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు జలకళను సంతరించుకుంటుంది. పాకాల సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3ఫీట్లు కాగా శుక్రవారం సాయంత్రానికి 25ఫీట్లకు చేరుకుంది. మరో 5.3ఫీట్ల నీరు చేరితే సరస్సు మత్తడి పోయనుంది. ఇదిలా ఉండగా.. ఇప్పటికే పాకాల ఆయకట్టు కింద అన్నదాతలు వరినాట్లు వేయడం ప్రారంభించారు.

అటవీశాఖలో బదిలీలు

న్యూశాయంపేట: వరంగల్ రేంజ్ పరిధిలోని వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేస్తూ అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి డోబ్రియల్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో విధులు నిర్వర్తిస్తు జూపార్క్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న బి.మయూరిని గూడూరు డివిజన్ రేంజ్ గంగారానికి బదిలీ చేశారు. వరంగల్ రేంజ్ ఫ్లయింగ్‌స్క్వాడ్‌లో విధులు నిర్వహిస్తున్న సందీప్‌రెడ్డిని వరంగల్ రేంజ్‌కు, కోటపల్లి రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్న సదానందాన్ని మంచిర్యాల చెన్నూర్ డివిజన్‌కు, పస్రా రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్న శిరీషను ఎల్కతుర్తికి బదిలీ చేశారు. వరంగల్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లో విధులు నిర్వహిస్తున్న నాగభూషణం నల్లగొండకు బదిలీ అయ్యారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే నాగరాజు



వర్ధన్నపేట: హైదరాబాద్‌లోని జలసౌధలో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలను కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో చెక్ డ్యాంలు తెగిపోయి మరమ్మతులకు గురయ్యాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఎమ్మెల్యే వెంట కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, నిమ్మాని శేఖర్‌రావు, పులి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూటీ ముందంజ

- జిల్లా అధ్యక్షురాలు సంగీత

కాశిబుగ్గ సెంటర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూటీ ముందుంటుందని పీఆర్టీయూటీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు కే.సంగీత అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని పలు మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ.. గతంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రమేశ్, జిల్లా కోశాధికారి ఎం.సర్వేశ్వర్, రాయపర్తి మండల అధ్యక్షుడు నీవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు

- స్త్రీనిధి రుణాల వడ్డీ చెల్లించని ప్రభుత్వం
- 2018 నుంచి మహిళా సంఘాలకు తప్పని నిరీక్షణ
- జిల్లాలో 11,438 ఎస్‌హెచ్‌జీలు.. 1,14,382 మంది సభ్యులు



రుద్రగూడెంలో సమావేశమైన గ్రామైక్య సంఘం సభ్యులు (ఫైల్)

నల్లబెల్లి: స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారికి వడ్డీ లేని రుణాలను అందిస్తోంది. బ్యాంకు లింకేజీతోపాటు స్త్రీనిధి రుణాలను మంజూరు చేస్తోంది. వాయిదాలు సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చింది. 2011 అక్టోబర్ 6న రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి సంస్థను ప్రారంభించింది. 2018 మార్చి నెల వరకు అప్పు తీసుకున్న సభ్యులు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తే వడ్డీ తిరిగి అందించింది. ఏప్రిల్ 2018 నుంచి నేటి వరకు సభ్యులకు రావాల్సిన వడ్డీ అందించడం లేదని స్త్రీనిధి రుణాలు పొందిన సభ్యులు వాపోతున్నారు. ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తే అసలు వాటాలు చెల్లిస్తే సరిపోతుందని భావించిన సభ్యులకు నిరాశే మిగులుతోంది. ప్రభుత్వం వడ్డీ డబ్బులు విడుదల చేయకపోవడంతో అప్పులు తీర్చాలని మహిళా సంఘాలపై బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఈ రుణాలను చెల్లించడానికి లబ్ధిదారులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

7,144 మంది సభ్యులు.. రూ.66.06 కోట్ల రుణాలు

జిల్లాలో 438 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. అందులో 11,438 స్వయం సహాయక సంఘాల్లో 1,14,382 సభ్యులు ఉన్నారు. గత సంవత్సరం జిల్లాలో 250 గ్రామైక్య సంఘాలకు సంబంధించి 2,531 స్వయం సహాయక సంఘాల్లోని 7,144 మంది సభ్యులు రూ.66.06 కోట్లు స్త్రీనిధి రుణాలు తీసుకొని వివిధ రకాల వ్యాపారాల్లో రాణిస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలను సక్రమంగా చెల్లించిన ఒక్కో సభ్యురాలికి వ్యక్తి గత రుణం రూ.20 వేల నుంచి రూ.3 లక్షల వరకు అందించారు. ఇందుకు సంబంధించి తీసుకున్న అప్పుకు కిస్తీ, వడ్డీని సభ్యులు వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్నారు. ఇలా చెల్లించిన వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరించాల్సి ఉంది. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో సభ్యులు చెల్లించిన వడ్డీని తిరిగి సంఘం ఖాతాల్లో జమచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కానీ, ఆరేళ్లు దాటినా ఆ ఊసే లేకపోవడంతో ఆయా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి స్త్రీ నిధి వడ్డీ డబ్బులు అందేలా కృషి చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వడ్డీ సకాలంలో చెల్లించాలి



రెండున్నరేళ్ల క్రితం స్త్రీనిధి పథకంలో నేను లక్ష రూపాయల రుణం తీసుకున్నా. వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ తిరిగి ఇస్తుందన్నారు. ఇప్పటి వరకు స్త్రీనిధి వడ్డీకి సంబంధించి రూపాయి కూడా రాలేదు. ప్రభుత్వం సకాలంలో వడ్డీ మంజూరు చేస్తే మాపై వడ్డీ భారం తగ్గుతుంది. ఇప్పటికైనా వడ్డీ మా ఖాతాల్లో జమచేసి ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటునందించాలి.

– నాగెల్లి, పావని, స్త్రీనిధి లబ్ధిదారు, నల్లబెల్లి

మంజూరుకాగానే ఖాతాల్లో జమ చేస్తాం



స్త్రీనిధికి సంబంధించి రుణాలు సక్రమంగా చెల్లించిన ఆయా సంఘాల సభ్యులకు వడ్డీ చెల్లింపు ఆరేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే. వాయిదాలు సక్రమంగా చెల్లించిన వారికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే నేరుగా ఆయా సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం.

– సైదిరెడ్డి, స్త్రీనిధి రీజినల్ మేనేజర్, వరంగల్

అర్జీలను త్వరగా పరిష్కరించాలి



ఈ ఫొటోలోని వ్యక్తి దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటకు చెందిన ఎలకంటి స్వామి. ఇతడు పుట్టుకతోనే మూగ. దివ్యాంగుల సర్టిఫికెట్‌లో 64శాతం ఉన్నప్పటికీ పింఛన్ లేదు. దీంతో ప్రజావాణిలో దరఖాస్తు చేసేందుకు మాజీ సర్పంచ్ సాగర్‌తో శనివారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చాడు.

- కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారదాదేవి, అధికారులు

కాశిబుగ్గ సెంటర్: దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, శిశు, స్త్రీ సంక్షేమ శాఖ అధికారి హైమావతి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యదేవితో కలిసి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రజావాణిలో డీఆర్డీఓకు సంబంధించిన ఫిర్యాదులు 11, పౌరసరఫరాల శాఖ 1, డీడబ్ల్యూఓ 2, సఖీ కేంద్రం 1, పోలీస్ డిపార్ట్‌మెంట్ 1, జిల్లా ఉపాధి కల్పన శాఖకు ఒకటి చొప్పున మొత్తం 17దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు సిఫారసు చేశారు.

దివ్యాంగుల పింఛన్ ఇప్పించండి



2021 సంవత్సరంలో దివ్యాంగుల సర్టిఫికెట్ పొందాను. పింఛన్ కోసం దుగ్గొండి ఎంపీడీఓకు దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటి వరకు పింఛన్ రావడం లేదు. పలుమార్లు అడిగిన లాభం లేకపోవడంతో ఇక్కడకు వచ్చాను. దయచేసి పింఛన్ వచ్చేటట్లు చూడాలి.

– దండు మురళీమోహన్, తిమ్మంపేట, దుగ్గొండి మండలం

ఇంటి స్థలం ఇప్పించండి



నేను దివ్యాంగురాలిని, ఒంటరి మహిళను ప్రస్తుతం మా అన్న ఇంట్లో ఉంటున్న. నాకు ఇంటి స్థలం మంజూరు చేసి డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వాలి. అనేకసార్లు దరఖాస్తు పెట్టుకున్న ఇప్పటి వరకు రాలే.. కలెక్టర్ గారు న్యాయం చేయాలని కోరుతున్న.

– కుమ్మరి శారద, వరంగల్ ఉర్సు ప్రతాప్ నగర్

30న జాబ్ మేళా

కాశిబుగ్గ సెంటర్: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఈనెల 30న వరంగల్ ములుగు రోడ్డు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో కోచింగ్, జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్.ఉమారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తిగల ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని సూచించారు. సందేహాల నివృత్తికి 95738 85532 నంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకోవాలి

- కలెక్టర్ సత్యశారదాదేవి
- ఖానాపురం మండలంలో ఆకస్మిక పర్యటన



సైనిక్‌స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారదాదేవి

ఖానాపురం: విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ సత్యశారదాదేవి సూచించారు. ఖానాపురం మండలంలో కలెక్టర్ సత్యశారదాదేవి శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం, వర్షాలకు కురుస్తున్న ఈజీఎస్ కార్యాలయాన్ని పరిశీలించారు. వాననీటితో రికార్డులు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో భాగంగా ఏర్పాటు చేసిన మెడికల్ షాపు, బేకరీని తనిఖీ చేశారు. బేకరీ షాపులో డబ్బులు చెల్లించి పలు ఆహార పదార్థాలను కొనుగోలు చేశారు. అనంతరం అశోక్‌నగర్‌లోని సైనిక్‌స్కూల్ ఆవరణలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో నాటిన మొక్కలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకోవాలని సూచించారు. మొక్కలు పెద్దగా పెరిగిన తర్వాత దత్తత తీసుకున్న విద్యార్థుల పేర్లు పెడతామని తెలిపారు. పాఠశాలలోని వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు డీఎంహెచ్‌ఓను పంపిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ కౌసల్యదేవి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎంపీడీఓ ఈగల భారతి, ఎంపీఓ అంబటి సునీల్, డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సురేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడొచ్చు

- డీఎంహెచ్‌ఓ వెంకటరమణ
- వైద్య ఆరోగ్య సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గీసుకొండ: కార్డియో పల్మనరీ రిసాసిటేషన్(సీపీఆర్) చేయడం ద్వారా ప్రాణాలను కాపాడొచ్చని, దీనిపై వైద్య సిబ్బందే కాకుండా ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాయు మార్గం, శ్వాస ప్రసరణ, డిఫిబ్రిలేషన్, షాక్ తదితర సమస్యలకు సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్రతీ పౌరుడికీ ఈ విధానం తెలిసి ఉంటే మంచిదని పేర్కొన్నారు. శిక్షణలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పద్మశ్రీ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఎస్‌ఓ విజయలక్ష్మి, డీపీఓ అర్చన, వైద్యాధికారులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- డీఈఓ వాసంతి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

కాశిబుగ్గ సెంటర్: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని డీఈఓ వాసంతి మండల రిసోర్స్ పర్సన్స్‌కు సూచించారు. నేషనల్ అచీవ్‌మెంట్–2024 సర్వేపై మండల రిసోర్స్ పర్సన్స్‌కు రెండో రోజు శిక్షణ కార్యక్రమం శనివారం వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ పలు సలహాలు, సూచనలు చేశారు. 3వ, 6వ, 9వ తరగతుల విద్యార్థుల గుణాత్మక విద్యా సాధనలో ప్రగతిని అంచనా వేయడానికి హిందీ మినహా అన్ని సబ్జెక్టుల్లో సర్వే నిర్వహిస్తారని అందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిలబస్ కోఆర్డినేటర్ కుడికాల సుభాష్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, డీసీఈబీ కార్యదర్శి గారే కృష్ణమూర్తి, ఎంఈఓ విజయ్‌కుమార్, హెచ్‌ఎం అరుణ తదితరలు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో ప్రక్షాళన

24 గంటల్లో ఎలక్ట్రానిక్ ధరల బోర్డు ఏర్పాటు

- వ్యాపారులను గుర్తించేందుకు తనిఖీలు
- కలెక్టర్ ఆదేశాలతో పారిశుద్ధ్య పనులు



మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలో కూరగాయల ధరలు



తెల్లవారుజామున మార్కెట్‌లో తనిఖీలు చేస్తున్న కార్యదర్శి నిర్మల

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్‌లో ప్రక్షాళన ప్రారంభమైంది. కొన్నేళ్లుగా మార్కెట్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండేవి. కలెక్టర్ సందర్శన సమయంలో మార్కెట్ మొత్తం బురదగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మార్కెట్ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో ప్రస్తుతం మార్కెట్ మొత్తం శుభ్రంగా మారింది. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే వినియోగదారులకు ధరలు తెలిసేలా 24గంటల్లోగా ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డును అధికారులు శనివారం ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం మార్కెట్ అధికారులతో కలెక్టర్ సమావేశమై పలు సూచనలు చేసినట్లు తెలిసింది.

వ్యాపారులకు గుర్తింపు కార్డులు..

కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. మార్కెట్‌లో ప్లాట్లు పొందిన చాలా మంది ఇతరులకు అద్దెకు ఇచ్చిన విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. గుర్తింపు కార్డులు ఉంటే ఎవరు అమ్మకాలు చేస్తున్న విషయం సులువుగా గుర్తించవచ్చని అధికారులతో అన్నట్లు సమాచారం. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల, గ్రేడ్–2 కార్యదర్శి రాము, ఏఎస్ రాజేందర్, సూపర్‌వైజర్లు మురళి, గంగాధర్, చక్రబహదూర్, లక్ష్మీనారాయణ, జేఎంఎస్ వివేక్ మార్కెట్‌లో వ్యాపారులను గుర్తించేందుకు శనివారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు.

టవర్ మరమ్మతులకు ఆదేశం..

లక్ష్మీపురం మార్కెట్‌లోని పాత కార్యాలయం వద్ద ఉన్న టవర్ మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ మార్కెటింగ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని మోజంజాహి మార్కెట్‌లో కూడా ఇదే మాదిరిగా టవర్ ఉందన్నారు. టవర్‌కు మరమ్మతులు చేసి, గడియారం ఏర్పాటు చేయాలని సూచించారు.

విచ్చలవిడి వ్యాపారానికి చెక్..

మార్కెట్‌లో కమీషన్ పేరుతో షట్టర్ల ముందు కూరగాయలు పోసి చిల్లరగా చేపట్టిన అమ్మకాలపై కలెక్టర్ కన్నెర్రజేశారు. కమీషన్ వ్యాపారులు హోల్‌సేల్‌గా అమ్మాలని, ఇలా విక్రయించకుంటే చర్యలు తప్పవని ఆదేశించారు. చిల్లరగా అమ్ముతున్న వారు ఎవరు, షట్టర్లు ఎవరి పేరు మీద ఉన్నాయో వెంటనే విచారణ చేసి నివేదిక అందించాలని డీఎంఓ ప్రసాదరావును ఆదేశించారు. ఆయన ముగ్గురు సూపర్‌వైజర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి లైసెన్సులు ఉన్న వారు, లేని వారు, అమ్మకాలు చేస్తున్న వారి వివరాలను కలెక్టర్‌కు అందించినట్లు తెలిసింది.

జిల్లాలో 107.7 మి.మీ వర్షపాతం

కాశిబుగ్గ సెంటర్: శుక్రవారం నుంచి శనివారం కురుస్తున్న వర్షంతో జిల్లాలో 107.7మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతవరణం శాఖ అధికారులు తెలిపారు. దుగ్గొండి 21.3మిల్లీమీటర్లు, నల్లబెల్లి 24.7మి.మీ, ఖానాపురం 19.8మి.మీ, ఖిలావరంగల్ 4.3మి.మీ, గీసుగొండ 4.7మి.మీ, చెన్నారావుపేట 6.5మి.మీ, వరంగల్ 4.9మి.మీ, వర్ధన్నపేట 1.8మి.మీ, నెక్కొండ 4.8మి.మీ, నర్సంపేట 8.0మి.మీ, సంగెం3.8మి.మీ, పర్వతగిరి1.8మి.మీ, రాయపర్తి 1.3మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్‌కు అలాట్ అయిన రమేశ్‌ను సీసీఎస్‌కు, పి.దామోదర్‌రెడ్డిని సీసీఎస్‌కు, ఎస్‌బీలో ఉన్న ఎం.రంజిత్‌కుమార్‌ను టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు.

బ్యాటరీల మాయంపై కలెక్టర్ ఆరా..

సాక్షి ఎఫెక్ట్



ఈజీఎస్ కార్యాలయం ఎదుట అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారదాదేవి

ఖానాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయంలో ఇన్వర్టర్ బ్యాటరీలు మాయమయ్యాయి. దీంతో సాక్షి దినపత్రికలో శనివారం 'ప్రభుత్వ కార్యాలయంలో బ్యాటరీలు మాయం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈనేపథ్యంలో ఖానాపురం మండలంలో ఆకస్మిక తనిఖీకి వచ్చిన కలెక్టర్ సత్యశారదాదేవి ఈజీఎస్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. బ్యాటరీలు ఏమయ్యాయి.. ఎవరు తీసుకెళ్లారనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో నూతన బ్యాటరీ లో ఉన్నాయని, పాతవి ఎక్కడ పెట్టారనే విషయం ప్రశ్నించడంతో ఎవరు తీసుకెళ్లారో అధికారులు కలెక్టర్‌కు తెలిపినట్లు సమాచారం. కార్యాలయానికి ఏపీఓ ఎందుకు రాలేదని ప్రశ్నించడంతో సెలవులో ఉన్నట్లు మండల పరిషత్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కాగా బ్యాటరీల మాయం విషయంలో కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.

గీతకార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతన్న అనంతుల రమేశ్

నర్సంపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని గౌడ జనహక్కుల పోరాట సమితి మోకు దెబ్బ మోకు దెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని సర్వాపురం గ్రామ శివారులోని గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మ ఆలయం ఆవరణలో జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కల్లు గీత వృత్తిదారులకు రూ.68కోట్లు, నీరా ప్రాజెక్టుకు రూ.25కోట్లు కేటాయించిందన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి రూ.500కోట్ల అవసరం ఉంటే రూ.68కోట్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రూ.7.90కోట్లను ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలని కోరారు. గీతకార్మికుల ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోడిశాల సదానందం, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్, నాయకులు గంప రాజేశ్వర్, ఐలుమల్లు, సుధాకర్, హరిప్రసాద్, మల్లేషం, గణేష్, జనగాం మల్లికార్జున్ పాల్గొన్నారు.

డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం: డయల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులపై అధికారులు, సిబ్బంది వేగంగా స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్, పెట్రోకార్ పోలీస్ అధికారులతో శనివారం ఆయన పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సమావేశమయ్యారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ పోలీస్ సిబ్బంది ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులు తీరుతెన్నులపై ఆరా తీశారు. ఫిర్యాదుదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకుగాను తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను అధికారులు, సిబ్బందికి సీపీ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవువుతున్న సమస్యలను సిబ్బంది.. సీపీ దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది కేవలం పెట్రోలింగ్ విధులే కాకుండా పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. దీంతోపాటు రౌడీషీటర్లను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు తిరుమల్, నందిరాం నాయక్, నర్సయ్య, భీంశర్మ, పార్థసారథి, జనార్దన్‌రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

- ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు అమలు



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లను విజయవాడ సెక్షన్‌లో రైల్వే ఇంజనీరింగ్ పనుల కారణంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. సికింద్రాబాద్–గుంటూరు గోల్కొండ, సికింద్రాబాద్–విజయవాడ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లను అప్ అండ్ డౌన్ మార్గంలో ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తు న్నట్లు వారు పేర్కొన్నారు. ఈ రద్దును ప్రయాణికులు గమనించాలని కోరారు.

రైల్వే విజిలెన్స్ అధికారుల తనిఖీ

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ పరిధిలో సికింద్రాబాద్ రైల్వే విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. కాజీపేట జంక్షన్ పరిధిలో గల రైల్వే క్రాసింగ్ గేట్ల వద్దకు వెళ్లి వాటి పనితీరు, గేట్‌మన్ల అప్రమత్తత, రాత్రి, పగలు విధుల పనితీరు, పరికరాలను తనిఖీ చేసినట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే గేట్ల వద్ద తనిఖీ చేసిన అధికారులు గేట్‌మన్ల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా కాజీపేట జంక్షన్ పరిధిలో కొంత మంది రైల్వే అధికారులు .. సిబ్బందిని తమ ఇళ్లలో సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

11వాహనాలు సీజ్

- రూ.3.75 లక్షల జరిమానా



సీజ్ చేసిన లారీలు

హసన్‌పర్తి: యాదాద్రి–ఆరెపల్లి జాతీయ రహదారి మార్గమధ్యలోని కోమటిపల్లి టోల్ గేట్ వద్ద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, గనులు, రాష్ట్ర పన్నుల విభాగం, ఆర్టీఏ అధికారులు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న 11 వాహనాలను గుర్తించారు. ఏడు ఇసుక లారీలు, డోలమైట్, గ్రానైట్ బ్లాక్ లారీలు ఒక్కొక్కటి, రెండు ఫ్లైయాష్ లారీలను సీజ్ చేశారు. రూ.3.75 లక్షల జరిమానా విధించారు.సీజ్ చేసిన లారీలను ఆర్టీఏ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు చెప్పారు. మోటార్ వెహికిల్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్.. కావొద్దు విషాదం

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- వర్షాకాలంలో పొంచి ఉన్న ముప్పు
- ఆదమరిస్తే అంతే.. ప్రాణాలు గాల్లోకి..
- తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకొద్దు



విద్యుత్ సబ్ స్టేషన్

హన్మకొండ: విద్యుత్.. విషాదం కావొద్దు. వినియోగదారులు, రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో తరచూ విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తుంటాయి. తడి దుస్తులు ఆరేస్తూ, మోటార్లు ఆన్ చేస్తూ, మరమ్మతుల సమయంలో విద్యుత్ తీగలు పట్టుకుని, తెగిన తీగల కారణంగా తరచూ పలువురు చనిపోతున్నారు. అలాగే, తెగిన విద్యుత్ లైన్లు, టాన్స్‌ఫార్మర్ గద్దెలు తక్కువ ఎత్తులో ఉండడంతో పశువులు కూడా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. దీనికి కారణం విద్యుత్ సిబ్బంది భద్రతా చర్యలు, ఎల్‌సీల్లో నిబంధనలు పాటించకపోవడమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సంస్థల యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలని సూచించినా సిబ్బంది వాటిని విస్మరించి విలువైన ప్రాణాలు పోగొట్టకుంటూ ఆయా కుటుంబాలను దుఃఖసాగరంలో ముంచుతున్నారు.

65 సబ్ స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా

హనుమకొండ జిల్లాలో 65 విద్యుత్ సబ్ స్టేషన్లు, 11,123 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. జిల్లాలో మొత్తం 4,41,252 మంది విద్యుత్ వినియోగదారులున్నారు. ఇందులో 3,27,020 మంది గృహ విద్యుత్ వినియోగదారులు, 64,204 మంది వ్యవసాయ విద్యుత్ వినియోగదారులున్నారు. వీరితో పాటు మిగతా వినియోగదారులున్నారు.

అప్రమత్తతే ఆయుధం

అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పొలాల వద్ద రైతులు, ఇళ్లలో కుటుంబీకులు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు కురుస్తున్న సమయంలో గోడలు, నేల, విద్యుత్ స్తంభాలు తేమతో నిండి ఉంటాయి. ఈ తేమతో ప్రమాదాలు జరుగుతాయి. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న స్తంభాల నుంచి నేల, గోడలు, ఇతర వస్తువులకు విద్యుత్ ప్రవాహం జరిగి విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశముంది. ఏ మాత్రం ఏమరు పాటు వహించిన ప్రాణాలు పోవడం ఖాయం. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా విద్యుదాఘాతానికి గురికాకుండా ఉండొచ్చు.

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షం కురుస్తున్న సమయంలో, కురిసిన తర్వాత తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు, సపోర్టు వైరు, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకొద్దు.
- దండెం వైర్లు, విద్యుత్ వైర్లను కలపొద్దు. సపోర్ట్ వైర్లుగా ఇన్సులేటెడ్ జీ.ఐ వైర్లను ఉపయోగించాలి.
- ప్రజలు, వినియోగదారులు విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీస్ వైర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వాటిని తాకకుండా దూరంగా నడవాలి.
- ఓల్టేజ్‌లో హెచ్చు తగ్గులున్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ అధికారులకు తెలపాలి.
- వర్షాలతో చెట్లు లేదా కొమ్మలు విద్యుత్ వైర్లకు తాకి షాక్ వచ్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి. వాటిని తాకకుండా విద్యుత్ అధికారులకు తెలపాలి.
- వ్యవసాయ నిమిత్తం, గృహాలలో అతుకులు లేని సర్వీస్ వైరును మాత్రమే ఉపయోగించాలి.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దు. వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలపాలి.
- ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలనే ఆత్రుతతో ముట్టుకోవద్దు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులు వాడడమే సరైన పరిష్కారం.
- ముఖ్యంగా రైతులు వ్యవసాయ పంపు సెట్లను వాడుతున్నప్పుడు కరెంట్ మోటార్లకు కాని, పైపులను కాని, ఫుట్ వాల్వ్‌లను కాని ఏమర పాటుతో తాకొద్దు. వ్యవసాయ పంపు సెట్లను , స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి. విద్యుత్ ప్రమాదాలు ఎర్త్ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయి. ఎర్త్ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జీ.ఐ పైపులు, ఫుట్ వాల్వ్‌లు తాకడం అత్యంత ప్రమాదకరం.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- మోటారు పంపుసెట్లకు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే సొంతంగా సరిచేద్దామని ప్రయత్నిస్తే ప్రాణనష్టం, హాని జరగొచ్చు. మోటారు రిపేరు తెలిసిన వారితోనే చేయించాలి.
- గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బంది లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్లను సంప్రదించి వారి సేవలు పొందాలి.
- విద్యుత్ పరికరాలు, వైరింగ్, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ గుర్తింపు కలిగినవి వాడాలి.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు అప్రమపత్తంగా ఉండాలి. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వినియోగదారులు మరింత జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్ సమస్యలు వస్తే ఏఈ, సిబ్బందికి తెలపాలి. ప్రతి నెల జారీ చేసే బిల్ కమ్ నోటీస్‌పై ఏఈ, లైన్‌మెన్ ఫోన్ నంబర్ ఉంటుంది. వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేయకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి వారితోనే సమస్యను పరిష్కరించుకోవాలి.

కె.వెంకటరమణ, ఎస్ఈ హనుమకొండ సర్కిల్

పొలానికి నీరుపారించడానికి వెళ్లి మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో రైతు మృతి
- కోనాపురంలో ఘటన



రాజిరెడ్డి (ఫైల్)

చెన్నారావుపేట: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని కోనాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తుమ్మలపెల్లి రాజిరెడ్డి(50) గ్రామ శివారులోని తన పొలం వద్దకు వెళ్లాడు. ఇటీవల నాటు వేయడంతో పొలం మడుల్లో నీరు పారించడానికి విద్యుత్ మోటార్ వద్దకు వెళ్లాడు. మోటార్ పనిచేయకపోవడంతో విద్యుత్ స్తంభానికి తగిలించిన తీగలను సరి చేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక విద్యుత్ తీగ ఊడి మీద పడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఏఎస్సై లక్ష్మణమూర్తి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు. కాగా, మృతుడికి భార్య పద్మ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

సీనియారిటీ ప్రకారం పదోన్నతులు

- టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పిస్తామని తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ మొదటి మహాజన సభ జరిగింది. ఈ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు అధికారుల సేవలు తమకు ఎంతో సంతృప్తి కలిగిస్తున్నాయన్నారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చన్నారు. పాలక వర్గంతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా బ్యాంకుల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య, డీసీసీబీ మహబూబ్‌నగర్ చైర్మన్ వెంకటయ్య, ఆదిలాబాద్ చైర్మన్ బోజా రెడ్డి, మెదక్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, తెలంగాణ డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వర రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, అసోసియేషన్ సభ్యులు ప్రభాకర్, ఉదయశ్రీ, కురువ నాయక్, అజయ్ రెడ్డి, చందర్ రావు, విశ్వేశ్వర్, స్రవంతి, కృష్ణ ప్రసాద్, శైలజ, అజయ్ పాల్గొన్నారు.

నిలకడగా ప్రాణహిత నది

- కాళేశ్వరం వద్ద 10.500 మీటర్ల ఎత్తులో ప్రవాహం
- మేడిగడ్డకు 8,85,795 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



కాళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత, గోదావరి నదులు

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది నిలకడగా ప్రవహిస్తోంది. శనివారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి పుష్కరఘాట్‌ను తాకుతూ 10.500మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. దీంతో వరద నీరు దిగువన అంబట్‌పల్లిలోని మేడిగడ్డ(లక్ష్మీ)బరాజ్‌కు చేరుతోంది. అక్కడ బరాజ్‌లోకి 8,85,795 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నప్పటికీ అన్నారం బరాజ్ వద్ద 14వేల క్యూసెక్కులు మాత్రమే తరలివస్తోంది. బరాజ్‌లోని 66గేట్లు ఎత్తినీటిని దిగువకు తరలిస్తున్నారు.

డిగ్రీ అధ్యాపకుల బదిలీ ప్రక్రియ

- 1,010 అధ్యాపకుల ఖాళీలు
- శనివారం అర్ధరాత్రి వరకు వెబ్‌ఆప్షన్లు
- ఒకటి, రెండ్రోజుల్లో బదిలీ ఉత్తర్వులు

విద్యారణ్యపురి : రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల బదిలీలకు విద్యాక మిషనర్ ఇటీవల షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో మల్టీజోన్–1పరిధిలో సబ్జెక్టుల వారీగా 1,010 మంది అధ్యాపక ఖాళీల జాబితాను రూపొందించారు. అందులో క్లియర్ వేకెన్సీలు 561గాను, 449 తప్పనిసరిగా బదిలీ కావాల్సినవిగా చూపారు. అభ్యంతరాలు కూడా స్వీకరించారు. శనివారం అర్ధరాత్రి వరకు బదిలీ ప్రక్రియకు అధ్యాపకులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించారు. ఐదేళ్లు ఒకేచోట పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తులు చేసుకున్నారు. మల్టీజోన్–1 పరిధిలో హనుమకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, నిర్మల్, మెదక్, కొమురం భీం, కరీంనగర్, ఆదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల పరిధిలో కళాశాలలకు అన్ని సబ్జెక్టుల అధ్యాపకులకు బదిలీలకు అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా ఎన్‌సీసీ బాధ్యతలు నిర్వర్తించే అధ్యాపకుల బదిలీలను శనివారం హైదరాబాద్‌లో ఫిజికల్ కౌన్సెలింగ్ నిర్వహించారు.10 మంది అధ్యాపకుల వరకు బదిలీ అయ్యారని సమాచారం. వీరికి కూడా త్వరలోనే ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 214 ఖాళీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 214 వరకు అధ్యాపకుల ఖాళీలు చూపారని సమాచారం. హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 116, వరంగల్ జిల్లాలో 31, మహబూబాబాద్‌లో 36, ములుగులో 16, జయశంకర్ భూపాలపల్లిలో 15 ఖాళీలు చూపారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసిన ఎక్కువమంది అధ్యాపకులు పట్టణ ప్రాంత కాలేజీలకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఒకటి, రెండ్రోజుల్లో అధ్యాపకులకు ఆర్డర్స్ ఇవ్వనున్నారు. ఈనెల 31 చివరి గడువు ఉండగా, బదిలీ ఆర్డర్స్ వచ్చిన వెంటనే తమకు కేటాయించిన కళాశాలల్లో జాయిన్ కావాల్సి ఉంటుంది.

ప్రిన్సిపాల్ పోస్టుల ఖాళీలు..

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బదిలీలకు 62 ప్రిన్సిపాల్స్ పోస్టులు వేకెన్సీలుగా చూపారు. అందులో క్లియర్ వేకెన్సీలు 39, తప్పనిసరిగా బదిలీలు 23 ఉన్నాయి. రాష్ట్రస్థాయి పోస్టు కావడంతో దరఖాస్తు చేసిన ప్రిన్సిపాల్స్ సీనియారిటీ జాబితా వెల్లడించారు. వీరికి కూడా వెబ్‌ఆప్షన్లను పెట్టుకునే అవకాశం కల్పించారు.

విద్యుత్ ఉద్యోగుల సాహసం

- కుంటలో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- అభినందించిన టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



కుంటలోని విద్యుత్ స్తంభంపై ఎక్కుతున్న విద్యుత్ అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులు సాహసం చేశారు. కుంటలో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. హసన్‌పర్తి చింత గట్టు నుంచి పలివేల్పుల వైపునకు వచ్చే 11 కేవీ వ్యవసాయ ఫీడర్‌లో విద్యుత్ అంతరాయం కలిగింది. అంతరాయాన్ని గుర్తిస్తూ వస్తున్న క్రమంలో పలివేల్పుల కుంట మధ్యలో నుంచి వెళ్లిన విద్యుత్ స్తంభంపై ఏదైనా లోపం ఏర్పడొచ్చనే ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడువుగా ఎన్పీడీసీఎల్ నయీంనగర్ ఏఈ అరుణ్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది శనివారం పలివేల్పుల కుంట వద్దకు చేరుకున్నారు. విద్యుత్ అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు బానోతు శ్రీను, మునిపల్లి శ్రీను ఈదుకుంటూ వెళ్లి స్తంభం జారుతున్నా అతి కష్టంపై ఎక్కారు. ఇన్సులేటర్ ఫెయిల్ (పంక్చర్) కావడం గుర్తించారు. అనంతరం సమస్యను సరి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, లైన్ ఇన్‌స్పెక్టర్ సుగుణాగర్, కుమారస్వామి, లైన్‌మెన్ కోటి పాల్గొన్నారు.

నా భర్తను మానసికంగా వేధించి చంపేశారు

- పోలీసులను ఆశ్రయించిన మృతుడి భార్య
- పోలీసుల అదుపులో నిందితుడు?

రామన్నపేట : అప్పు ఇవ్వకపోతే ఇంట్లోకి చొరబడి చితకబాదడమే కాకుండా మానసికంగా వేధించి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడేలా చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం.. వరంగల్ పోతన నగర్‌కు చెందిన వీరగంటి రమేశ్(66), రమాదేవి దంపతులు తాపీ మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రమేశ్.. కరీమాబాద్‌కు చెందిన తుంగళ్ల దేవేందర్, తుమ్మ రాజు వద్ద కొంత అప్పు చేశాడు. ఈ క్రమంలో దేవేందర్, రాజు తమ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తావని పేర్కొంటూ రమేశ్‌ను 22వ తేదీన సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అనుసరించారు. రాత్రి ఇంటికి వెళ్లినా చొరబడి రమేశ్‌తో పాటు అతడి భార్య రమాదేవిపై కూడా దాడికి పాల్పడ్డారు. అనంతరం 23వ తేదీన సాయంత్రం రమేశ్ పెద్ద కొడుకు వీరగంటి రాజును సైతం దేవేందర్, రాజు తరపు వ్యక్తులు బెదిరించి దూషించారు. దీంతో ఈ ఘటనలపై రమేశ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. 24వ తేదీన రాత్రి ఎప్పటి లాగే నిద్రించాడు. 25వ తేదీ ఉదయం రమేశ్ నోటి నుంచి నురుగు వచ్చిన విషయం గమనించి కుటుంబీకులు వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించగా అదే రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పోలీసులు.. దేవేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారని సమాచారం.

ఆర్థిక ఇబ్బందులు.. ఉద్యోగం పర్మనెంట్ కాదేమోనని..


పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

తొర్రూరు: ఉద్యోగం పర్మనెంట్ కాదేమోనని ఒకవైపు, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో గ్రామ పంచాయతీ కార్యదర్శి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం...పట్టణానికి చెందిన పేర్ల చిన్న భిక్షం, గండెమ్మ దంపతుల కుమారుడు వెంకన్న(32) దంతాలపల్లి మండలం లక్ష్మీపురంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దానికితోడు ఉద్యోగం పర్మనెంట్ కాకపోవడంతో మనస్తాపానికి లోనయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన వెంకన్న శనివారం పట్టణ శివారు కంతాయపాలెం రోడ్డులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గజ ఈతగాళ్లు, వర్ధన్నపేట అగ్నిమాపక సిబ్బంది సహాయంతో పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి భార్య లక్ష్మి, రెండేళ్ల వయసున్న కూతురు హర్షిత ఉన్నారు. ప్రస్తుతం లక్ష్మి ఏడు నెలల గర్భిణి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

పాలకుర్తి మండల కేంద్రంలో ఫర్టిలైజర్ వ్యాపారి..



సోమశేఖర్ (ఫైల్)

పాలకుర్తి టౌన్ : ఆర్థిక ఇబ్బందులతో ఫర్టిలైజర్ వ్యాపారి శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పాలకుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిప్రసన్నకుమార్ కథనం ప్రకారం.. పాలకుర్తికి చెందిన సతేంద్ర సోమశేఖర్(32) మండల కేంద్రంలో నాలుగు సంవత్సరాల నుంచి ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపులో ఆర్థికంగా నష్టం రావడంతో దంపతుల మధ్య గొడవలు జరిగాయి. దీనికి మనస్తాపం చెందిన సోమశేఖర్.. శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమశేఖర్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎరువుల కంపెనీల డీలర్ల ఒత్తిళ్లతో..

ఫర్టిలైజర్ షాపు నిర్వహణకు సోమశేఖర్ రూ. 20 లక్షల పెట్టుబడి పెట్టాడు. రైతులకు ఎరువులు, పురుగుల మందులు ఉద్దెర ఇవ్వడం.. వారు సకాలంలో డబ్బు చెల్లించకపోడంతో పలు కంపెనీల నిర్వాహకులు సోమశేఖర్‌పై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని ఓ కంపెనీ.. సోమశేఖర్ షాపులో నిల్వ ఉన్న స్టాక్‌ను తీసుకెళ్లింది. ఎరువుల కంపెనీల డీలర్లు నిత్యం డబ్బుల కోసం రావడంతో దంపతుల మధ్య జరిగిన గొడవలు సోమశేఖర్ ఆత్మహత్యకు దారి తీశాయని సమాచారం. కాగా, మండల కేంద్రంలో సోమశేఖర్ చిత్రపటానికి ఫర్టిలైజర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు అడ్డూరి భూపాల్‌రావు, కార్యదర్శి బత్తుల వెంకన్న, సభ్యులు దొడ్డ మధు, రాపాక సంతోష్, హరీశ్, మామిండ్ల శోభన్‌బాబు, శివ నివాళులర్పించారు.

లోక్యతండాలో యువరైతు..



సాంబయ్య (ఫైల్)

వేలేరు: అప్పులబాధతో ఓ యువరైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం లోక్యతండా గ్రామంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. లోక్యతండా గ్రామానికి చెందిన మురావత్ సాంబయ్య (34) ఉన్న రెండు ఎకరాల్లో వరి, పత్తి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న తన కొడుకు ఆరోగ్యం బాగలేకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్ చేసి చికిత్స చేయిస్తున్నాడు. ఇందుకు రూ.2.50 లక్షల వరకు అప్పు తెచ్చాడు. సాగుకు తెచ్చిన అప్పులు అప్పటికే రూ.3.50లక్షలు ఉన్నాయి. కొడుకు ఆరోగ్యం బాగాలేకపోవడం, గతేడాది పంటలు సరిగా పండక చేసిన అప్పులు తీర్చేమార్గం లేక శుక్రవారం మధ్యాహ్న సమయంలో వ్యవసాయబావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి తన చెల్లెకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆమె వెంటనే వారి బంధువులకు సమాచారం ఇవ్వగా బావివద్దకు వెళ్లి చూసేసరికి చేనులో పడిపోయి ఉన్నాడు. వెంటనే అక్కడికి వెళ్లిన వారు 108కి సమాచారం అందించగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేలేరు ఎస్సై హరిత శనివారం తెలిపారు.